క్లుప్తంగా

ఉన్నత పాఠశాల తనిఖీ



కొత్తపల్లి: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని తహసీల్దార్ జయరాములు అన్నారు. బుధవారం మండలంలోని భూనీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం తాజా కూరగాయలతో ఆహారం వడ్డించాలని వంట ఏజెన్సీ మహిళలకు సూచించారు. అనంతరం నిల్వ ఉంచిన బియ్యం, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెన్నకేశవరెడ్డి, మండల గిర్దావరి శ్రావణ్ పాల్గొన్నారు.

చింతల్‌దిన్నెలో ఉచిత పశువైద్య శిబిరం



మద్దూరు: మండలంలోని చింతల్‌దిన్నెలో పశువైద్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం పశువైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 14 ఆవులకు, 35 గేదెలకు చూడి పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు డాక్టర్లు సబిత, విశాల తెలిపారు. కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్ విజయ్, గోపాలమిత్రలు, రైతులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడలకు గురుకుల విద్యార్థి ఎంపిక



గణేష్

ధన్వాడ: ఈ నెల 7నుంచి 9వరకు డెహ్రాడూన్‌లో జరిగే ట్రెడిషన్ నెట్‌బాల్ పోటీలకు తెలంగాణ రాష్ట్ర పురుషుల జట్టుకు ప్రాతినిధ్యం వహించేందుకు మండంలోని కొండాపూర్ గిరిజన గురుకుల విద్యార్థి ఆర్.గణేష్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజారాం, కోచ్ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ రామ్మోహన్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణేష్ ఐదో తరగతి నుంచి నెట్‌బాల్ మినీ స్పోర్ట్స్ అకాడమీలో ఎంపికై ఇప్పటివరకు పలు రాష్ట్రాల్లో గోల్డు మెడల్ సంపాదించాడని తెలిపారు. జాతీయ స్థాయి పోటీలలో మూడు సార్లు పాల్గొని ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు.

పాఠశాలకు సీసీకెమెరాలు అందజేత



మరికల్: మండలంలోని గాజులయ్యతండా ప్రభుత్వ పాఠశాలకు కొత్తకోటకు చెందిన గణేష్ సెక్యూరిటీ సిస్టం మేనేజింగ్ డైరెక్టర్ దాత రాజవర్ధన్‌రెడ్డి ఉపాధ్యాయులకు సీసీ కెమెరాలు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం నవీన్ మాట్లాడుతూ తమ పాఠశాల భద్రతను దృష్టిలో ఉంచుకొని సీసీ కెమెరాలు అందించిన దాతను అభినందించారు.

ఇటుకల తయారీపై క్షేత్రస్థాయి అవగాహన



కోస్గి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఇటుకల తయారీపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించామని నాచారంలోని ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు వీరమల్లేశం తెలిపారు. బుధవారం గ్రామ శివారులో ఇటుకలు చేస్తున్న వారిని స్వయంగా పరిశీలించారు. బంకమట్టిని సేకరించి బూడిద, నీటితో కలిపిన అనంతరం పశువులతో తొక్కిస్తామన్నారు. మట్టిని ముద్దలుగా చేసి ఇటుక ఆకారం అచ్చులో వేసి తీసి రెండు రోజులు ఎండబెట్టి బట్టిలో పేర్చి కట్టెలు, వరిపొట్టుతో కాల్చుతామన్నారు. ఎర్రగా కాలగానే చల్లార్చి ఇళ్లు కట్టుకునేవారికి విక్రయిస్తామని తెలిపారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

దామరగిద్ద: మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించనున్న కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డి హాజరుకానున్నారు. మండలంలోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను అందజేస్తున్నట్లు తహసీల్దార్ దయాకర్‌రెడ్డి తెలిపారు. లబ్ధిదారులు హాజరై చెక్కులు అందుకోవాలని తెలిపారు.

రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలపాలి

- ఆర్టీసీ ఆర్‌ఎం సంతోష్ కుమార్



నారాయణపేట బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఆర్‌ఎం సంతోష్‌కుమార్

నారాయణపేట రూరల్: అధికారులు, కార్మికులు సమిష్టిగా పని చేసి నారాయణపేట ఆర్టీసీ డిపోను అగ్రగామిగా నిలపాలని ఆర్టీసీ ఆర్‌ఎం సంతోష్ కుమార్ అన్నారు. స్థానిక డిపోను బుధవారం సాయంత్రం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సర్వీసల వారీగా ఈపీకే, కేఎంపీఎల్ పరిశీలించి, పలు రకాల రికార్డులను పరిశీలించారు. గ్యారేజీ, బస్టాండ్‌లో పర్యటించి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. ఆర్టీసీకి ఆదాయ వనరులను పర్యవేక్షించారు. అనంతరం కార్మికులను కలిసి మాట్లాడారు. డిపో నుంచి బయటికి వెళ్లే ప్రతి బస్సును పూర్తిస్థాయిలో కండిషన్ కలిగి ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, డ్రైవర్లు కండక్టర్లు కలిసి పనిచేస్తే ప్రతి ట్రిప్పులో మంచి ఆదాయం తీసుకొచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఎండీ సజ్జనార్ ఏర్పాటు చేసిన లక్ష్యే లక్ష్యంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కండక్టర్లు తప్పనిసరిగా విజిల్ వాడాలని, ప్రతి స్టేజీ వద్ద సౌత్ అండ్ లడ్ చేసి ప్రయాణికులకు బస్సులో ఎక్కించుకునేందుకు రూటు వివరాలు తెలియజేయాలన్నారు. మహాలక్ష్మి ప్రయాణికులు, టికెట్ ప్రయాణికుల మధ్య తేడా లేకుండా చూడాలన్నారు. ప్రతి ఒక్కరు సమయం ప్రకారం డ్యూటీకి హాజరై ప్రతి సర్వీసులో అత్యధిక ఆదాయం తేవడానికి ప్రయత్నం చేయాలన్నారు. ప్రతి ట్రిప్పులు జీరో టికెట్లతో పాటు డబ్బులు వచ్చే ప్రయాణికులను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. రోజువారి ఖర్చులకు ఆ డబ్బులే ఆధారమని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో డీఎం లావణ్య, అసిస్టెంట్ మేనేజర్ అలివేలమ్మ, మెకానికల్ ఇన్‌చార్జి చంద్ర నాయక్, ఆఫీస్ సూపరింటెండెంట్ పి.నరేందర్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

'పది'లో ఉన్నత ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న డీఈఓ గోవిందరాజులు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ బాలాజీ

సాక్షి, నెట్‌వర్క్: పదో తరగతి వార్షిక పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మెరుగైన ప్రతిభ చూసి ఉన్నత ఫలితాలు సాధించాలని డీఈఓ గోవిందరాజులు అన్నారు. బుధవారం కోస్గి పట్టణంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో కొనసాగుతున్న ప్రత్యేక తరగతులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులతో డీఈఓ మాట్లాడుతూ పరీక్షలుంటే భయపడొద్దని, ఇష్టంతో చదివితే విజయం సులువు అవుతుందని అన్నారు. సబ్జెక్టులో సమస్యలుంటే ఉపాధ్యాయులతో నివృత్తి చేసుకోవాలన్నారు. ప్రభుత్వం పాఠశాలల్లో చేపడుతున్న ప్రత్యేక తరగతులను విద్యార్థులు ఉపయోగించుకొని మంచి ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం పాఠశాలలోని రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ శంకర్‌నాయక్, ఉపాధ్యాయులు ఉన్నారు.

- పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచాలని ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు ఆదేశించారు. మద్దూరు మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు కొనసాగుతున్న ఇంటర్‌షిప్‌ను పరిశీలించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టినా సాయంత్రం స్నాక్స్‌ను పరిశీలించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. డీఈఓ వెంట సెక్టోరియల్ అధికారి శ్రీనివాసులు, కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.
- పది పరీక్షల్లో మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు చక్కటి పేరును తీసుకురావాలని ఎంఈఓ బాలాజీ అన్నారు. నారాయణపేట మండలంలోని కోటకొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోషల్ రివిజన్ టెస్ట్ ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెడ్మాస్టర్ సత్యనారాయణ సింగ్, జీహెచ్‌ఎం సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందించిన ఎంఈఓ బాలకిష్టప్ప



మద్దూరు: ఈ నెల 1 నుంచి 3 వరకు మంచిర్యాల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో నారాయణపేట జిల్లా జట్టు మూడో స్థానం సాధించింది. అందులో మద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులే ఉండడంతో వారిని బుధవారం పాఠశాల ఆవరణలో ఎంఈఓ బాలకిష్టప్ప క్రీడాకారులను అభినందించారు. వారికి మెరిట్ సర్టిఫికెట్లను అందజేశారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన కోచ్ వెంకటప్పను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

మద్దూరు: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేస్తోందని బీఆర్‌ఎస్ మండల నాయకులు అన్నారు. బుధవారం మద్దూరులో విలేకర్ల సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు గోపాల్ మాట్లాడుతూ కుల గణన చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తామని ఎన్నికల సమయంలో కామారెడ్డిలో డిక్లరేషన్ చేశారన్నారు. అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించకుండా కేంద్రానికి నివేదిక పంపుతామనడం ఏమిటని ప్రశ్నించారు. 2011లో కేంద్ర చేపట్టినా సర్వేలో బీసీల జనాభా 52 శాతం ఉందని, కేసీఆర్ చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో కూడా 52 శాతంపైనే వచ్చిందన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణనలో బీసీల జనాభా 46 శాతాని పడిపోయిందని గుర్తు చేశారు. అన్ని వర్గాల ప్రజలను ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. స్థానిక ఎన్నికల్లో ఈ పార్టీకి ప్రజలే బుద్ధిచెబుతారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రాములు, సాయిలు, పొన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైక్లింగ్ పోటీలు



మక్తల్: తెలంగాణ రాష్ట్ర సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 9న నారాయణపేట జిల్లా స్థాయి మౌంటెన్ సైక్లింగ్ పోటీలు(మట్టి రోడ్డులో) బాలబాలికలకు 10 కిలోమీటర్ల పోటీలు నిర్వహిస్తున్నట్లు సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గోపాలం తెలిపారు. 14 నుంచి 16 ఏళ్ల లోపు విద్యార్థులకు, 18 ఏళ్ల నుంచి 23 ఏళ్లలోపు మహిళలకు, పురుషులకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలు మక్తల్ నుంచి వడ్వాట్ మట్టి రోడ్డులో ఉంటాయని, ఈ కార్యక్రమానికి మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరవుతారని తెలిపారు. పోటీలో గెలుపొందిన మొదటి, ద్వితీయ స్థానం సభ్యులను ఈ నెల చివరి వారంలో హైదరాబాద్-శ్రీశైలం మట్టి రోడ్డులో జరుగు రాష్ట్ర స్థాయి మౌంటెన్ సైక్లింగ్ పోటీలలో పాల్గొనాలని తెలిపారు. కార్యక్రమంలో సైక్లింగ్ అసోసియేషన్ సభ్యులు అమ్రేష్, దామోదర్, రమేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు



అగ్ని ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్న భక్తులు

ధన్వాడ: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభయ్యాయి, మొదటి రోజు గోపూజ, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, ధ్వజారోహణం తదితరల పూజలు నిర్వహించారు. శుక్రవారం బొడ్రాయి ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



నారాయణపేట: జిల్లా కేంద్రంలో ఏఎస్‌ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. పలు వాహనదారులకు బ్రీత్ అనలైజర్‌తో డ్రంకన్ కండిషన్ తనిఖీ చేసి 11 కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా శిక్షణ ఏఎస్‌ఐ ఆంజనేయులు మాట్లాడుతూ వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. కేసులు పునరావృతం అయితే వాహనం సీజ్ చేసి డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తారన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై ధర్నా



మక్తల్‌లో ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ యూనియన్ నాయకులు

మక్తల్: అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కోట్లాది మంది కార్మికులకు సామాజిక భద్రత కల్పిస్తామని చెప్పిన మోదీ ప్రభుత్వం, భద్రత కల్పించకపోగా కార్మిక హక్కులపై దాడులకు పాల్పడుతోందని ఏఐటీయూసీ యూనియన్ జిల్లా కార్యదర్శి నర్సింహులు అన్నారు. బుధవారం మక్తల్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ సంపద ఉత్పత్తిలో శ్రమశక్తిని ధారపోస్తున్న అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కోట్లాది మంది కార్మిక వర్గానికి కేంద్ర బడ్జెట్‌లో నిరాశను మిగిల్చిందన్నారు. వారికి సామాజిక భద్రత కల్పించే విధంగా ఈఎస్‌ఐ, పీఎఫ్, గ్రాడ్యుటీ పథకాలను విస్తరింప చేస్తామని మోదీ పదేపదే చెబుతున్నప్పటికీ వాటిని ఆదుకోనుటకు ఈ బడ్జెట్లో నిధులుకేటాయంచలేదన్నారు. బడ్జెట్‌లో కార్పొరేట్ సంస్థలను ప్రోత్సహించే విధంగా కార్పొరేట్లకు అనేక సౌకర్యాలు కల్పిస్తూ సబ్సిడీలు ఇస్తూ, కార్మిక, కర్షకులకు బడ్జెట్ కేటాయించకపోవడం దారుణమైన విషయమన్నారు. కార్యక్రమంలో నాయకులు శివయ్య, మణెమ్మ, చంద్రమ్మ, మల్లమ్మ, కేశవ, తదితరులు పాల్గొన్నారు.

మద్దెల్‌బీడ్ పాఠశాలలో ఎంఈఓ ఆకస్మిక తనిఖీ

దామరగిద్ద: మండలంలోని మద్దెల్‌బీడ్ ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈఓ కృష్ణారెడ్డి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల తరగతుల్లో విద్యార్థుల సామర్థ్యాలను పరిక్షించారు. అనంతరం మధ్యాహ్న భోజనం, నిల్వ ఉన్న బియ్యం పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శంకర్, ఉపాధ్యాయులు శశిధర్, తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా ఎల్లమ్మ బండారోత్సవాలు



మరికల్‌లో బండారు చల్లుతున్న కులస్తులు

మరికల్/ఊట్కూరు: మండల కేంద్రంలోని బీరప్పస్వామి ఆలయ ఆవరణలో బుధవారం కుర్వ కులస్తులు ఘనంగా ఎల్లమ్మ బండారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లమ్మ పటం వేసి పూజలు చేశారు. అనంతరం కస్పె కుర్వ కులస్తులపై బంధువులు బండారు చల్లారు.

- ఊట్కూరు మండల కేంద్రంలో బీరలింగేశ్వర స్వామి ఉత్సవాల్లో భాగంగా గ్రామ శివారులోని బీరప్పదేవాలయం వద్ద ఎల్లమ్మ బండారు కార్యక్రమం చేపట్టారు. ముందస్తుగా ఎల్లమ్మ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. వేలాదిమంది బండారు చల్లుతూ పలువురిని ఆశీర్వదించారు. భక్తులు ఎల్లమ్మ దేవతకు మేకలను, గొర్రెలను నైవేద్యంగా సమర్పించారు. స్టేట్ మాజీ కార్పొరేషన్ చైర్మన్ దేవరి మల్లప్ప ఎల్లమ్మ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎల్కోటి నారాయణరెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి, భాస్కర్, యజ్ఞేశ్వర్‌రెడ్డి, వై జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

బోధన సమయంలో టీఎల్‌ఎంను ఉపయోగించాలి



విద్యార్థులతో బోర్డుపై రాయిస్తున్న కాంప్లెక్స్ హెచ్‌ఎం గణేష్‌సింగ్

కృష్ణా: ఉపాధ్యాయులు తప్పనిసరిగా టీఎల్‌ఎం ద్వారా విద్యార్థులకు బోధించాలని కాంప్లెక్స్ హెచ్‌ఎం గణేష్‌సింగ్ సూచించారు. బుధవారం మండలంలోని మురహర్‌దొడ్డి ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. 40 రోజుల యాక్షన్‌ప్లాన్ అమలు చేయాలని, టీచింగ్ డైరీని ప్రతి ఉపాధ్యాయుడు రాయాలని, విద్యార్థులకు హోంవర్క్, మార్కుల ఆన్‌లైన్ నమోదు తదితర అంశాలపై సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులతో పలు పాఠ్య అంశాలపై బోర్డుపై రాయించి పరీక్షించారు. ఇందులో హెచ్‌ఎం ఈరన్న, ఉపాధ్యాయులు అజయ్ తదితరులు ఉన్నారు.

చెన్నారెడ్డిపల్లిలో గజ్జెలమ్మ జాతర



గజ్జెలమ్మ అలయం దగ్గర మొక్కులు చెల్లించుకుంటున్న గ్రామస్తులు



గజ్జెలమ్మకు బోనాల ఊరేగింపు

మద్దూరు: మండలంలోని చెన్నారెడ్డిపల్లి గ్రామంలోని గజ్జెలమ్మ జాతర ఉత్సవాలు రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి అమ్మవారికి మహిళలు బోనాల ఊరేగింపు నిర్వహించి ప్రత్యేక నైవేద్యం సమర్పించారు. సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

'బేటీ బచావో-బేటీ పడావో' దశాబ్ది ఉత్సవాలు



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ధన్వాడ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బేటీ బచావో- బేటీ పడావో పథకం పదేళ్లు విజయవంతంగా పూర్తి అయిన సందర్భంగా మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ పాఠశాలలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆశ్రా మాట్లాడుతూ మొక్కలు పర్యావరణానికి ఎంతో మేలు చేస్తాయని, ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. పాఠశాల పరిసరాలలో మొక్కలు నాటారు. బాలికల కోసం బాల్యవివాహాల నిర్మూలన కోసం బడిబయటి పిల్లలను బడిలో చేర్పించడం, బాలికలు జీవితంలో అత్యున్నత శిఖరాలను చేరుకోవడానికి ప్రభుత్వం ప్రారంభించిందని నిర్వాహకులు తెలిపారు. ఇందులో జెండర్ స్పెషలిస్టులు అనిత, నర్సింహులు, ఆర్థిక నిపుణులు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా ద్వాదశ జ్యోతిర్లింగ మహాపడి పూజ



ద్వాదశ జ్యోతిర్లింగాల పూజ కార్యక్రమం

మాగనూర్: మండల కేంద్రంలోని ప్యాటీశ్వరాలయంలో గురుస్వామి సంగన్న ఆధ్వర్యంలో బుధవారం మహాపడి పూజ నిర్వహించారు. ఆలయ పూజారి జంగం ప్రవీణ్ పూజా కార్యక్రమం నిర్వహించారు. శివమాలధర స్వాములు ఉదయం నుంచి లింగాభిషేకం, జ్యోతిర్లింగ పూజలు చేశారు. ప్రతి ఒక్కరిలో భక్తిభావాన్ని పెంపొందించుకోవాలన్నారు. శివస్వాముల మాల ధరించడం చాలా పవిత్రమైనదని పేర్కొన్నారు. గురువారం అగ్నిగుండ కార్యక్రమం ఉంటుందని, శివస్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. భక్తులందరికి మాగనూర్ శివస్వాములు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామస్తులు, శివ భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతలపై ప్రజలకు అవగాహన కల్పించాలి



బాపూర్ గ్రామ శివారులో రైతులతో మాట్లాడుతున్న నాయకులు

ఊట్కూర్: ప్రభుత్వం ముందస్తుగా మక్తల్-కొడంగల్ ఎత్తిపోతల పథకంపై ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించాలని మాజీ జెడ్పీటీసీ అరవింద్ కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని బాపూర్ గ్రామ శివారులో బుధవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎత్తిపోతల పథకం భూసేకరణకు ప్రజాభిప్రాయం తీసుకోవాలని కోరారు. ఎత్తిపోతల పథకం డిజైన్‌ను మార్చాలని, పైప్‌లైన్ ద్వారా కాకుండా కెనాల్ ద్వారా నీటిని తరలించాలని డిమాండ్ చేశారు. అధికారులు రైతులకు సమాచారం ఇవ్వకుండా సర్వే, మట్టి నమూనా పనులు చేపట్టడం తగదని ఆరోపించారు. ఎత్తిపోతల పథకంపై అవగాహన లేక పలు గ్రామాల ప్రజలు అయోమయానికి గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులతో సమావేశాలు నిర్వహించి, వారి అభిప్రాయసేకరణతో పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ అశోక్ కుమార్ గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, నాయకులు వెంకటేశ్‌గౌడ్, రైతులు మశ్చందర్, బాలప్ప, మధువర్మ, కిష్టయ్య, హన్మంతు పాల్గొన్నారు.

పేటలో సినిమా షూటింగ్



నారాయణపేట రూరల్: శర్మస్తూ ఫీలిమ్స్ ఆధ్వర్యంలో అనుశ్రీ, అల్తాఫ్ హాసన్ కథానాయకులుగా 'రాజిగాడు రాజయ్యడు' పేరుతో నిర్మిస్తున్న చిత్రాన్ని బుధవారం జిల్లా కేంద్రంలో చిత్రీకరించారు. తెలంగాణ నేపథ్యంలో కులవృత్తులపై సాగే ఈ చిత్రం పట్టణంలోని బారంబావి, కుమ్మరివాడ, పళ్ల సరఫ్ బజార్ తదితర ప్రాంతాల్లో కొన్ని సన్నివేశాలు చిత్రీకరించారు. ఈసందర్భంగా చిత్ర దర్శకులు అల్తాఫ్ హాసన్, సెన్సార్ బోర్డ్ సభ్యులు రంగయ్య మాట్లాడారు. షూటింగ్‌కు సహకరించిన పట్టణ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

'ఇందిరమ్మ ఇళ్లు ఇస్తే.. ఎకరా స్థలం కేటాయిస్తా'

దామరగిద్ద: ఇంటి స్థలం లేని నిరుపేద కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తే తన సొంత స్థలంలో ఉచితంగా ఇంటి స్థలాన్ని కేటాయిస్తానని మండలంలోని కందెన్‌పల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు శంకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కందెన్‌పల్లిలో ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తే తన తల్లి పేరున ఉన్న పాగదొడ్డి ప్రాంతంలో ఎకరం భూమిని కేటాయిస్తానని పేర్కొన్నారు.

జాతర పేరుతో తెరుచుకోని బడి

మాగనూర్: ఒకవైపు ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాలు పెంచాలని ఉన్నతాధికారులు నిరంతరం కృషి చేస్తుంటే, కొందరు టీచర్లు మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. మండల పరిధిలోని పుంజనూర్ గ్రామంలో జాతర పేరుతో గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు వరుసగా రెండు రోజులు లోకల్ సెలవులు ఇచ్చారు. దీంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే గ్రామంలోని పాఠశాలలో విద్యార్థుల హాజరుశాతం బాగా తగ్గిపోయిందని, ఇప్పుడు ఉపాధ్యాయుల నిర్లక్ష్యంతో మరింత పాఠశాల హాజరుశాతం క్షీణిస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరుసగా ఆది, సోమవారం ప్రభుత్వ సెలవులు రాగా, మళ్లీ లోకల్ హాలిడే ఇవ్వడంతో నాలుగు రోజులుగా పాఠశాల మూతపడి ఉంది. ఈ విషయంపై మండల విద్యాధికారిని వివరణ కోరగా, పుంజనూర్ పాఠశాలకు వరుసగా రెండు రోజులు లోకల్ హాలిడే ఇవ్వడంపై తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై జిల్లా విద్యాధికారికి ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

